క్లుప్తంగా

ఆర్‌ఎంపీల సమస్యలపై స్పీకర్‌కు వినతి



గుంటూరు మెడికల్: గ్రామీణ వైద్యులు(ఆర్‌ఎంపీ) సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడుకి తెలుగునాడు కమ్యూనిటీ పారా మెడిక్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రవిచంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ రసూల్, హనుమంతరావు గురువారం వినతిపత్రం అందజేశారు. గతంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రతో గ్రామీణ వైద్యుల సమస్యలను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి లోకేష్‌తో చర్చించి సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తామని శాసనసభాపతి హామీ ఇచ్చినట్లు యూనియన్ నేతలు వెల్లడించారు.

మార్పు మన నుంచే మొదలవ్వాలి



గుంటూరు ఎడ్యుకేషన్: మార్పు అనేది ఎక్కడ నుంచో రాదని, అది ముందుగా మన నుంచే మొదలవ్వాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఎవరో మారాలి, ఏదో చేయాలనే భావన విడనాడి, మన మార్పుతో సమాజంలోని సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనాలని సూచించారు. గత, ప్రస్తుత విద్యాసంవత్సరంలో సమాజ సేవ కార్యక్రమాలను నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులను అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారిణి ఆర్.జయశైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం అభినందించారు.

వాటర్ ట్యాంకర్లపై కేసులు



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో నీళ్ల సరఫరా చేసే వాటర్ ట్యాంకర్లకు సంబంధించిన పర్మిట్లు, లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్‌లు లేకుండా తిరిగే వాహనాలపై చర్యలు తీసుకోక తప్పదని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం పేర్కొన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో పర్మిట్లు, పన్నులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని మూడు లారీ వాటర్ ట్యాంకర్లు, రెండు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ట్యాంకర్ యాజమానులు తమ వాహనాలకు సంబంధించి అన్ని రోడ్లు పన్నులు, పర్మిట్లు, ఇన్సూరెన్స్‌లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పక కలిగి ఉండాలని లేని పక్షంలో కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



నగరంపాలెం: మోటారు వాహన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) టి.లీలావతి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు రవాణాశాఖ (ఆర్టీఏ) ఆధ్వర్యంలో సిమ్స్ కళాశాలలో గురువారం మోటారు వాహనాల చట్టాలపై, ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి టి.లీలావతి మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని అన్నారు. స్నేక్ డ్రైవింగ్, అతి వేగంతో వాహనాలు నడపొద్దని వాహన చోదకులకు సూచించారు. ఏ వాహనం నడిపిన అత్యంత జాగ్రత్తగా నడపాలని చెప్పారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే కుటుంబాలు ఆర్థిక పరిస్థితులు దుర్భరంగా మారుతాయని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని చెప్పారు. ర్యాగింగ్ నిషేధ చట్టం అమల్లో ఉందన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఉన్నతంగా చదువుకుని మంచి కొలువుల్లో స్థిరపడాలని చెప్పారు. మత్తు పదార్థాలు వాడకం, అక్రమ రవాణాతో జీవితాలు దుర్భరంగా మారుతాయని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్టీఏ ఎంవీ సీఐలు సౌజన్య, మల్లీశ్వరి పాల్గొన్నారు.

కార్గిల్ విజయోత్సవ ర్యాలీ



కాగడాలతో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలో కాగడాల ప్రదర్శన, 75 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు మైలా హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్‌ను గడగడలాడించిన భారత్ యుద్ధ వీరులు ఎంతోమంది వారి ప్రాణాల కోల్పోయి అసువులు బాసిన వారికి గుంటూరులోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించడం స్ఫూర్తిదాయకమన్నారు. యుద్ధంలో ఎంతోమంది సైనికులు దేశం కోసం ప్రాణాలను తెగించి చరిత్రలో నిలిచిపోయే విధంగా కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నామని తెలిపారు. ఎంతోమంది సైనికుల ప్రాణ త్యాగమే మన మందరం ఈ స్వేచ్ఛ వాయువుల్ని పీల్చుకుంటున్నామని కొనియాడారు. యువ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు రోహన్ సైగల్ మాట్లాడుతూ అప్పటి ప్రధాని వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ దేశం శాంతి భద్రత కోసం పనిచేస్తున్న సైనికులకు, దేశంలో ఉగ్రవాదం లేకుండా నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, జనసేన అధ్యక్షుడు గాదే వెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాటిబండ్ల రామకృష్ణ, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవనీత్ కృష్ణా రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి శ్రీనాద్, జోనల్ ఇన్‌చార్జ్ అశోక్ రెడ్డి, నాయకులు కొక్కెర శ్రీనివాస్ యాదవ్, చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతి రావు, యశ్వంత్, సమత, బాలకొటయ్య, గోపి, ఫణి కృష్ణ, జాబిలి శ్రీనివాస్, ఈశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

పసికందులకు ఉచితంగా కంటి పరీక్షలు



పసికందులకు కంటి పరీక్షలు చేస్తున్న డైక్ సెంటర్ సిబ్బంది

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఆవరణలోని జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రం(డైక్)లో నెలరోజుల వయస్సు ఉన్న పసికందులకు ఉచితంగా రెటినోపతి పరీక్షలు చేశారు. రాజమండ్రికి చెందిన గౌతమి ఐ ఇనిస్టిట్యూట్ సహకారంతో ప్రతినెలా రెండు సార్లు పసికందులకు రెటినోపతి పరీక్షలు చేసి ఎవరికైనా కంటి సమస్యలు ఉంటే తాడిగడప ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్ చేస్తున్నారు. గురువారం 37 మంది పసికందులకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు చేశామని, వాటిల్లో నలుగురికి సమస్య ఉన్నట్లు గుర్తించినట్లు డైక్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి గురువారం వరకు 188 మంది పసికందులకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి, 56 మందికి సమస్య ఉన్నట్లు గుర్తించి, 11 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేసినట్లు వివరించారు. పిల్లల తల్లిదండ్రులు తమ బిడ్డలకు పుట్టిన వెంటనే కంటి పరీక్షలు చేయించడం ద్వారా కంటి చూపు పోకుండా కాపాడుకోవచ్చని, పూర్తి వివరాలకు డైక్ సెంటర్‌లోని ఆప్టో మెట్రీషియన్ బుస్సా ప్రతాప్‌కుమార్‌ను 9440144487 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



సీఐలకు నూతన సీసీ కెమెరాలు అప్పగిస్తున్న ఆటోడ్రైవర్ల యూనియన్ సభ్యులు, డ్రైవర్లు

నగరంపాలెం: నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని సీఐలు అన్వర్‌బాషా(కొత్తపేట), కోటేశ్వరరావు(తూర్పు ట్రాఫిక్) అన్నారు. కొత్తపేట పీఎస్ పరిధిలోని గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు వైపు ఆవరణలో గురువారం సాయంత్రం ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఏడు నూతన సీసీ కెమెరాలను రైల్వేస్టేషన్ ఆటోడ్రైవర్స్ యూనియన్, శ్రీచైతన్య ఆటోవర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జీజీహెచ్ ఆటోస్టాండ్ యూనియన్, స్వస్తిక్ ఆటో యూనియన్, ఏఐటీయూసీ అంబులెన్స్ యూనియన్ సంయుక్తంగా అందజేశారు. ఆటో యూనియన్ల సభ్యులను తూర్పు ఏఎస్పీ నచికేత్‌షెల్కే, సీఐ అభినందించారు. ఈ సందర్భంగా సీఐలు అన్వర్‌బాషా, కోటేశ్వరరావు మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. జన సంచారం రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపకరమని పేర్కొన్నారు. వీటి ద్వారా నేరాలను నియంత్రించవచ్చునని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో కూడిన సీసీ కెమెరాలు అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. ప్రతిచోట ఏర్పాటు చేయడంతో నేర రహిత సమాజ నిర్మాణంలో కీలకంగా మారుతాయని పేర్కొన్నారు. ఆటో యూనియన్ సభ్యులు సమాజం కోసం నూతన కెమెరాలను అందజేసి, దాతృత్వాన్ని చాటుకున్నారని చెప్పారు.

ప్రతి కుటుంబం టాయిలెట్లు వినియోగించాలి



పాతమల్లాయపాలెం గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్

ప్రత్తిపాడు: మరుగుదొడ్లను నిర్మించుకున్నప్పటికీ కొందరు వాటిని వినియోగించడం లేదని, ప్రతి కుటుంబం టాయిలెట్లు వినియోగించాలని ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజా అన్నారు. పాతమల్లాయపాలెంలో ఉప సర్పంచి సిద్ధంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన గ్రామ సభ గురువారం నిర్వహించారు. ఖాజా మాట్లాడుతూ మరుగుదొడ్లు లేని వారు పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ డబ్బారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్రక్రియ చేపట్టడం, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు హాజరైన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

గ్రామాల్లో జరుగుతున్న గ్రామ సభలకు ఎట్టకేలకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు హాజరయ్యారు. హర్ ఘర్ జల్, ఓడీఎఫ్ ప్లస్‌పై గ్రామాల్లో గత మూడు రోజులుగా గ్రామ సభలు జరుగుతుండటం, సభలకు అజెండా అంశమైన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పత్తా లేరంటూ ఈ నెల 24వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'ఉత్తుత్తి సభలు.. ఊకదంపుడు ఉపన్యాసాలు' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ప్రత్తిపాడు మండల పరిధిలోని పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం, మేడావారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్ హాజరై హర్ ఘర్ జల్ పథకంపై ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు తాగునీటి పరీక్షలు నిర్వహించి స్వచ్ఛమైన జలాన్ని గ్రామంలోని అన్ని కుటుంబాలకు అందించడమే హర్ ఘర్ జల్ ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

విజ్ఞాన్ లైబ్రేరియన్ రజనీకుమారికి గ్రంథాలయ పురస్కారం



లైబ్రేరియన్ రజనీకుమారిని అభినందిస్తున్న విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయ అధికారిణి ఆచంట రజనీకుమారి గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, డాక్టర్ వెలగా వెంకటప్పయ్య పేర్లతో ప్రతిష్టాత్మకంగా ఇచ్చే గ్రంథాలయ పురస్కారం అందుకున్నట్లు విజ్ఞాన్ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణం గురువారం తెలిపారు.

ఈ సందర్భంగా వీసీ నాగభూషణం మాట్లాడుతూ అన్నమయ్య సేవా సమితి ఆధ్వర్యంలో గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కేజీ శంకర్, డాక్టర్ ఆరేటి కృష్ణకుమారి చేతుల మీదుగా గ్రంథాలయ పురస్కారంతో పాటు రూ.10 వేల నగదు బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. ఆచంట రజనీకుమారి గత 28 సంవత్సరాలుగా లైబ్రేరియన్‌గా ఎంతో విలువైన సేవలు అందించారని, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకులకు అవసరమైన పుస్తకాలను, పరిశోధన పత్రాలను అందజేయడంలో చేసిన కృషికి గాను ఈ పురస్కారం లభించిందన్నారు. విజ్ఞాన్ వర్సిటీ లైబ్రరీలో 1,15,000 పుస్తకాలు, 2 లక్షల ఈ–బుక్స్ అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఏపీఎల్‌ఏ శాశ్వత సభ్యురాలిగా గుర్తింపు పొందటంతో పాటు అనేక విశ్వవిద్యాలయాల్లో జరిగిన జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని గ్రంథాలయ అభివృద్ధిపై అనేక పత్రాలను సమర్పించారని పేర్కొన్నారు. పురస్కారం అందుకున్న ఆచంట రజనీకుమారి మాట్లాడుతూ ఈ పురస్కారం నా మీద మరింత బాధ్యతను పెంచడంతో పాటు గ్రంథాలయాల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రంథాలయ పురస్కారం అందుకున్న ఆచంట రజనీకుమారిని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య అభినందించారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

పెన్షనర్లకు కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం

సీబీఐసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి గద్దె తిలక్

లక్ష్మీపురం: కేంద్ర బడ్జెట్‌లో పెన్షనర్లకు ఎటువంటి మేలు జరగలేదని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి గద్దె తిలక్, టి.వివేకానంద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెన్షనర్స్‌కు బడ్జెట్‌లో ఇన్ కమ్ టాక్స్‌ను రద్దు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోవడం అన్యాయమని తెలిపారు. ఇన్ కమ్ టాక్స్ కొత్త స్కీమ్‌లో ఇచ్చిన కొన్ని మినహాయింపులు కేవలం కొందరికే మాత్రమే ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. బడ్జెట్ లో ఎనిమిదవ పే కమిషన్ గురించి అసలు ప్రస్తావనే రాలేదని ఆరోపించారు. పెన్షనర్లందరికి ఇది తీవ్ర నిరాశ పరచిన బడ్జెట్ అని వెల్లడించారు.

పునీత అన్నమ్మ మహోత్సవాలు



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం పునీత అన్నమ్మ మహోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ ప్రిన్సిపాల్ సిస్టర్ జి.విమల మేరీ మాట్లాడుతూ మేరీమాత తల్లి అయిన అన్నమ్మ పిల్లలకు క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో కూడిన విద్యాబుద్ధులను నేర్పించడంలో ఆదర్శమూర్తి అని కొనియాడారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ సిస్టర్ అమలమేరీ జోస్పిన్ మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ చదువుల తల్లిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు సిస్టర్ ఝాన్సీ, ఇతర అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు పొన్నూరులో బహిరంగ సభ



నెహ్రూనగర్: దళిత బహుజన ఉద్యమ నేత, కవి డాక్టర్ కత్తి పద్మారావు 71వ జన్మదినాన్ని పురస్కరించుకుని కుల నిర్మూలన దినంగా పాటిస్తూ ఈ నెల 27వ తేదీన పొన్నూరులోని లుంబిని వనంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం అరండల్‌పేటలోని బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావుపూలే, పెరియార్ రామస్వామి నాయకర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలను ముందుకు తీసుకువెళుతున్న మార్గదర్శకులు ఈ సభకు హాజరవుతారని తెలిపారు. బహిరంగ సభలో కత్తి పద్మారావు రచించిన గ్రంథాలను ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దళిత, బహుజన నాయకులు తాటికొండ నరసింహరావు, సాదు మాల్యాద్రి, నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

గుర్రం జాషువా చిరస్మరణీయుడు



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా చిరస్మరణీయుడని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జాషువా కవిత కంఠం విలక్షణమైందని అన్నారు. సాహితీ వేత్త ముప్పాళ్ళ పి.ఎస్.ప్రసాదరావు, ప్రముఖ కవి జమదగ్ని మాట్లాడుతూ జాషువా ప్రజా కవి, తెలుగు ప్రజల కవి అని నిత్య జీవితంలో కానీ సాహితీ జీవితంలో కానీ ఎన్ని కష్టాలు ఎదురైనా ఓటమి ఆయన దరి చేరలేదని ధీరత్వంతో నిబ్బరంగా నిలబడ్డారని తెలిపారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

గుంటూరు ఓఎస్‌ఎస్ న్యాయవాది ఎ.విజయలక్ష్మి



మాట్లాడుతున్న సీడీపీఓ సుజాతదేవి

ప్రత్తిపాడు: మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని గుంటూరు మహిళా ప్రాంగణం వన్ స్టాప్ సెంటర్(ఓఎస్‌ఎస్) న్యాయవాది ఎ.విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మహిళలకు పని ప్రదేశాల్లో, ఇంటా, బయటా ఎదురయ్యే లైంగిక వేధింపులపై ఎలా పోరాడాలి? చట్టాలు ఎలా రక్షణగా ఉన్నాయన్న అంశాలపై వాటర్ ఇండియా సహకారంతో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ వి.సుజాత దేవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఓఎస్‌డబ్ల్యూ న్యాయవాది విజయలక్ష్మి హాజరయి మాట్లాడారు. లైంగిక వేధింపుల నుంచి మహిళలను రక్షించేందుకు 2013లో లైంగిక వేధింపుల చట్టం అమల్లోకి తీసుకువచ్చారని తెలిపారు. అత్యవసర సమయాల్లో మహిళలు 181 హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి సాయం పొందవచ్చన్నారు. మహిళలకు ఎలాంటి సమస్యలున్నా నేరుగా ఓఎస్‌ఎస్ సెంటరును సంప్రదించవచ్చని సూచించారు. సీడీపీఓ సుజాతదేవి మాట్లాడుతూ మహిళలు ఆత్మస్థైర్యంతో తమ విధులను నిర్వర్తించాలన్నారు. విధుల్లో ఎదురయ్యే ఆటుపోట్లను సమర్థంగా ఎదుర్కోగలిగినప్పుడే ఉద్యోగం సంతృప్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ సీడీపీఓ విజయనిర్మల, సూపర్‌వైజర్లు అరుణ, వెంకటరత్నం, ఇండియా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

పేద గుండెకు భరోసా 'జీజీహెచ్'

ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్



రోగితో కలసి వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి కార్డియో థొరాసిక్ సర్జరీ వైద్య విభాగంలో గుండె శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఆస్పత్రిలో గురువారం సర్జరీ చేయించుకున్న రోగితో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మత్తు వైద్య నిపుణులు పోలయ్య, రామరాజు సహకారంతో గుండె శస్త్రచికిత్సలను విజయవంతం చేస్తున్నారని చెప్పారు. ఎనిమిది నెలల వ్యవధిలో అయోర్టిక్ వాల్వ్ రీప్లేసెమెంట్ ఎక్కువగా జరిగాయని, ఈ ఆపరేషన్లు ప్రైవేట్ ఆస్పత్రులలో కేవలం ఒకటి, రెండు కేసులు మాత్రమే చేస్తారన్నారు. మైట్రల్ వాల్వ్ రీప్లేసెమెంట్ ఆపరేషన్లు ప్రభుత్వ ఆస్పత్రిలో చేయడం అరుదైన విషయమని పేర్కొన్నారు. ఎనిమిది నెలల వ్యవధిలో 56 గుండె ఆపరేషన్‌లు చేశారని వివరించారు. గుండె, ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే శిక్షణ ఇచ్చి దగ్గరుండి వైద్యులను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. ఆపరేషన్ల విజయవంతం చేయడంలో విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణ మూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పేరం కుప్పు స్వామి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రమోద, డాక్టర్ యోగి, మత్తు వైద్య విభాగాధిపతి పోలయ్య, వైద్యులు సుధాకర్, రామరాజు, ఏమిమా, స్వర్ణలత, ఫార్మసి మెడికల్ ఆఫీసర్, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు ఆషా సజని, గంగమ్మ పాత్ర కీలకంగా ఉందని కిరణ్‌కుమార్ వివరించారు.

మంత్రి సవితకు బీజేపీ నేతల వినతిపత్రం



మంత్రి సవితకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: రాష్ట్ర బీసీ వెల్ఫేర్, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల శాఖ మంత్రి సవితకు బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు సమస్యలపై వినతిపత్రం గురువారం అందజేశారు. కొలనుకొండ వద్ద జయభేరి అపార్టుమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందించారు. రాష్ట్ర పర్యటనలో బీసీ ప్రజల నుంచి వచ్చిన సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శులు బోయ మురళీనాయుడు, ఆవుల నాగేంద్ర, బీజేపీ నేతలు తుల్లిమిల్లి రామకృష్ణ, శివ లలిత, కె.రామకృష్ణ, రాకేష్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు చిన్న చిట్టిబాబు, గుంటూరు జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శులు శేషగిరి రావు, యశోద కృష్ణ, వీరేంద్ర కుమార్, సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు స్వాతి సింగ్, లీగల్ సెల్ కో కన్వీనర్ అలా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల కట్టడిపై విస్తృత ప్రచారం



సతీష్‌కుమార్, జిల్లా ఎస్పీ

నగరంపాలెం: జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్(పీఎస్) పరిధిలో ఆటోల ద్వారా మాదక ద్రవ్యాలు, చెడు అలవాట్లపై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా ఎస్పీ కె.సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పోలీస్ అధికారులను ఆదేశించారు. మత్తు, చెడు అలవాట్ల వలన తలెత్తే దుష్పరిణామాలపై యువతకు మరింతగా అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణ, నేరాల పరిశోధనలో సీసీ కెమెరాల పనితీరు అత్యంత కీలకమని పేర్కొన్నారు. కెమెరాలను జిల్లాలోని ప్రధాన కూడళ్లల్లో ఏర్పాటు చేయడం వల్ల 24 గంటలు నిఘా ఉంటుందని తెలిపారు. ప్రతి పీఎస్ పరిధిలో కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు వాటి పనితీరుని పునః పరిశీలన చేసుకోవాలన్నారు. కెమెరాల ఏర్పాటుపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



సంస్థ ప్రతినిధులు అందజేసిన కిట్లతో అంగన్‌వాడీలు, వార్డు సభ్యులు, వీఓఏలు

ప్రత్తిపాడు: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని వాటర్ ఎయిడ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులకు నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సురేష్ నీటి నాణ్యత పరీక్ష విధానాలు, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, మరుగుదొడ్ల ఆవశ్యకత, పరిసరాలు, చేతుల పరిశుభ్రత వంటి అంశాలను వివరించారు. ఆయా అంశాలపై పనిచేసే ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా వాటర్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా కిట్లను వారికి అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో సుజాత దేవి, ఏసీడీపీవో విజయనిర్మల, తుమ్మలపాలెం సర్పంచ్ నాగమల్లేశ్వరి, తిక్కిరెడ్డిపాలెం సర్పంచ్ మాకినేని జగన్‌మోహన్‌రావు, వాటర్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులు సాయి, సునీల్, సత్యవాణి, వేణు, తుమ్మలపాలెం, ఈదులపాలెం, తిక్కిరెడ్డిపాలెం, నిమ్మగడ్డవారిపాలెం గ్రామాల వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం

గుంటూరు రూరల్: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన అమ్మిలినేని భార్గవ తేజను జిల్లా నగర శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం జేసీ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జేసీకి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్.కొండయ్య, కార్యదర్శి కె.పవన్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు జంగిలి రవికుమార్, కోశాధికారి ఆర్.వెంకాయమ్మ, సంయుక్త కార్యదర్శి కె.మస్తాన్‌రావు, నగర శాఖ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి కె.వీరాస్వామి, కోశాధికారి కె.మురళి, ఉపాధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ కార్యవర్గ సభ్యులు తదితరులున్నారు.